ఇది చారిత్రాత్మక నిర్ణయం



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానం ప్రవేశ పెట్టడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ఇచ్చిన మాటకు కట్టుబడి శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం చారిత్రాత్మకం. రాయలసీమ ప్రాంతాన్ని వివిధ రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు సీమ బిడ్డగా సీఎం చంద్రబాబు కృషి అభినందనీయం. శాశ్వత బెంచ్ ఏర్పాటుతో సీమ ప్రజలకు న్యాయ సేవలు కర్నూలులోనే అందుబాటులోకి వస్తాయి.

- ఎన్ఎండీ ఫరూక్, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, నంద్యాల



ఏడాదిలో ప్రక్రియ పూర్తి చేయాలి



కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని ఆ రోజు స్పష్టంగా చెప్పాం.. పరిపాలన సౌలభ్యం కోసం కోర్టు రాజధానిలోనే ఉండాలని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాం. న్యాయ శాఖ మంత్రి మంత్రి ఫరూక్ నాయకత్వంలో బెంచ్ ఏర్పాటు కాబోతుండడం ఆనందంగా ఉంది. ఏడాదిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరుతున్నాను.

- నారా లోకేశ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి

నాడు హామీ.. నేడు ఆమోదం





కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ మరో అడుగు ముందుకుపడింది. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి వి. సునీత గత నెల 28న లేఖ రాశారు. దీనికి బుధవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తీర్మానం ప్రవేశ పెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కర్నూలు న్యాయ రాజధాని అని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టింది. ఎన్నికల ముందు ప్రజాగళం సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ఐదు నెలలకే అమలు దిశగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. దీంతో అసెంబ్లీ తీర్మానంపై రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు అంటూ గత వైసీపీ ప్రభుత్వం తన రాజకీయ స్వలాభం కోసం ఐదేళ్లు మభ్యపెట్టింది. మరోవైపు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ మంగళగిరిలో ఏర్పాటుకు సంబంధించి జీవో ఇచ్చారు. 2022 డిసెంబరు 5న కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైసీపీ నిర్వహించిన సీమ గర్జన సభలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నూలును న్యాయ రాజధానిగా మారుస్తాం.. హైకోర్టు ఏర్పాటు చేస్తామంటూ పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారు. బుగ్గన ఓ అడుగు ముందుకేసి కర్నూలు నగరానికి నాలుగు వైపులా 25 కిలోమీటర్ల దూరంలో కనిపించేలా జగన్నాథగట్టుపై అందమైన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. అయినా అమలుకు చర్యలు చేపట్టలేదు.

మిగతా 7లో..



కర్నూలుకు హైకోర్టు బెంచ్

- అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఏకగ్రీవంగా ఆమోదించిన శాసన సభ
- రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం
- ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం లేఖ
- ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ..
- ఐదు నెలల్లోనే అమలుకు శ్రీకారం
- ఐదేళ్ల పాటు నాన్చిన జగన్ ప్రభుత్వం

హైకోర్టు బెంచ్‌ను స్వాగతిస్తున్నాం

చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదుల క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటనపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ గౌడ్‌తో కలిసి న్యాయవాదులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో రాయలసీమ ప్రజలను మభ్యపెడుతూ ఐదేళ్ల కాలం వెళ్లదీసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదునెలల్లోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, న్యాయవాదులు శ్రీనివాస్ బట్, శాంతకుమార్, కృష్ణమూర్తి, రవిగువేర, తివిక్రమ్, మురళీమోహన్, దాశెట్టి శ్రీనివాసులు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

స్మార్ట్ మీటర్ల పని తీరుపై ఎస్ఈ ఉమాపతి



కల్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి తెలిపారు. గురువారం కర్నూలు టౌన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆయన అధికారులు, అదానీ గ్రూప్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సేవలందించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని అన్నారు. అనంతరం స్మార్ట్‌మీటర్ల పనితీరుపై ఎస్ఈ అదానీ గ్రూప్ ప్రతినిధులతో వాటి ఏర్పాటు, ప్రణాళికపై ఎస్ఈ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి. శేషాద్రి, కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, ఏడీఈలు, అదానీ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలి ప్యానల్ ఛైర్మన్‌గా బీటీ నాయుడు



కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో ప్యానల్ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడు వ్యవహరించారు. గురువారం తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. శాసన మండలిలో గత ఐదేళ్ల కాలంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అనునిత్యం ప్రజా సమస్యలపై మండలిలో పోరాటం చేశామన్నారు. బీటీ నాయుడుకు దక్కిన ఈ అవకాశంపై టీడీపీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

వానొస్తే ఎలా..?

రైతుకు క'న్నీ'రు



రేయింబవళ్లు రైతులు చెమటోడ్చి సాగు చేసిన పంట దిగుబడులు చేతికందే సమయంలో అకాల వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు మంచి దిగుబడి వస్తే ఈ ఏడాదైనా అప్పులు తీరుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మొక్కజొన్న కోతలు పూర్తై గింజలను ఆరబెట్టుకుంటున్నారు. వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో అకాలంగా వర్షాలు, ఈదురుగాలులు మొదలయ్యాయి. వానకు తడవకుండా పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పంట దిగుబడులు తడిసిపోకుండా కాపాడుకోడానికి టార్పాలిన్లను గత వైసీపీ ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేయలేదు. దీంతో ఈ భారం కూడా రైతులే మోయాల్సివస్తోంది. కూటమి ప్రభుత్వమైనా రాయితీపై టార్పాలిన్లు ఇస్తుందా? అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ధాన్యంపై కప్పి ఉంచిన పట్టలు

- ఆరబెట్టుకుంటున్న పంట దిగుబడులను కాపాడుకోలేక రైతుల కష్టాలు
- రాయితీపై టార్పాలిన్లు పంపిణీ చేయని ప్రభుత్వం
- అదనపు వ్యయంతో కుదేలవుతున్న రైతులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, తెలుగు గంగ, ఎస్ఎల్‌సీ, హంద్రీనీవా ప్రధాన సాగు నీటి వనరుల ఆధారంగా ఖరీఫ్‌లో దాదాపు 6.5 లక్షల హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో వరి పైరును, నంద్యాల జిల్లాలో 56 వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. మొక్కజొన్న కోతలు దాదాపు పూర్తై గింజలను రైతులు ఆరబెట్టుకుని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గత నెలలో అకస్మాత్తుగా తుఫాను రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన దిగుబడులు కళ్లెదుటే తడిసిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ప్రారంభమవుతుండడం.. అకాల వర్షాల ప్రమాదం పొంచి ఉండటంతో రైతులు ఆందోళన నెలకొంది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లను అధిక ధరలు వెచ్చించి కొనలేక ఇబ్బందిపడుతున్నారు.

మిగతా 6లో..



మార్కెట్‌లో విక్రయించేందుకు వచ్చిన టార్పాలిన్లు



మొక్కజొన్న గింజలను కాపాడుకునేందుకు పట్ట కప్పుతున్న రైతు

పార్టీని రద్దు చేసి ఇంట్లో కూర్చో

వైఎస్ జగన్‌పై కుడా ఛైర్మన్ సోమిశెట్టి ఫైర్



కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 'జగన్.. నీకు రాజకీయాలు చేతకాదు. పార్టీని రద్దు చేసి ఇంట్లో కూర్చో..' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తనదైన శైలిలో విమర్శించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లి, చెల్లిపై కేసులు వేయడం, సోషల్ మీడియాలో వేధింపులకు గురి చేసిన నీకు రాజకీయాలు అవసరమా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తుంటే నిరాధారమైన ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదన్నారు. తండ్రి మరణిస్తే శవాన్ని పక్కన పెట్టుకుని సీఎం పదవీ కోసం సంతకాల సేకరణ చేయించి, శవరాజకీయాలు చేసి నీవా చంద్రబాబు గురించి మాట్లాడేది అని మండిపడ్డారు. జగన్ గత చరిత్ర.. ప్రస్తుత పరిస్థితి ఏమిటో రాష్ట్ర ప్రజలందరికి తెలుసన్నారు. రాష్ట్ర ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు సిగ్గురాలేదని ఎద్దేవ చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ములేని దద్దమ్మకు రాజకీయాలు అవసరమా? అన్నారు. ఇకపై చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజల మధ్య తిరగకుండా చేస్తామని హెచ్చరించారు.

బ్యాటరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

కడప ఈడీ పైడి చంద్రశేఖర్

కర్నూలు రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులకు ఉపయోగించే బ్యాటరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి.చంద్రశేఖర్ అన్నారు. కర్నూలులో ఆర్టీసీ జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాలలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు సంబంధించిన మెకానికల్ ఇన్‌చార్జిలు, ఎలక్ట్రీషియన్‌లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కడప ఈడీ పైడి చంద్రశేఖర్, కర్నూలు ఆర్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ బ్యాటరీలు దీర్ఘకాలికంగా పని చేయాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎక్సైడ్ సర్వీసు ఇంజనీర్లు, బ్యాటరీ మెయింటెనెన్స్‌పై పలు అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ హరిబాబు, సీటీఎం సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్‌హుస్సేన్, ప్రిన్సిపాల్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పంట.. వానొస్తే తంట..!

(5 పేజీ తరువాయి)

పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు రైతులకు అందించే టార్పాలిన్లపై రాయితీ కనుమరుగైంది. గత టీడీపీ హయాంలో వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, ఉపాధిహామీ పథకం ద్వారా రాయితీపై టార్పాలిన్లను పంపిణీ చేసేవారు. మార్కెట్ ధరలో యాభై శాతం రైతు భరిస్తే మిగిలిన యాభై శాతం ప్రభుత్వం రాయితీ ఇచ్చేది. అలా ఒక్కో రైతుకు రెండు నుంచి మూడు వరకు టార్పాలిన్లు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టార్పాలిన్ల పంపిణీని పూర్తిగా విస్మరించింది. యంత్రాలు పొలంలోకి వచ్చి కోత ప్రారంభించనప్పటి నుంచి గింజలు, ధాన్యాన్ని ఆరబోసుకునే వరకు టార్పాలిన్ల అవసరం విరివిగా ఉండడంతో రైతులు మార్కెట్‌లో వాటిని కొనక తప్పడం లేదు. 30 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు ఉన్న పట్ట దాదాపు రూ.3 వేలు పెట్టి కొంటున్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు ఒక రోజుకు ఒక పట్టకు రూ.30 నుంచి రూ.40 వెచ్చించి బాడుగకు తెచ్చుకుంటున్నారు. ఒక ఎకరా వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పది పట్టలు అవసరమని, ఇది అదనపు ఆర్థిక భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతల సమయంలో అవస్థలు తప్పవు

ఏటా కోతల సమయంలో అవస్థలు తప్పడం లేదు. మొక్కజొన్న గింజలను ఆరబెట్టుకునేందుకు, వర్షం నుంచి కాపాడుకునేందుకు టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నాం.

-జాఫర్, రైతు, చింతకుంట్ల

రాయితీపై పంపిణీ చేయాలి

ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్లను పంపిణీ చేయాలి. వ్యవసాయంలో సాగు వ్యయం పెరగడం, దిగుబడులు తగ్గుతుండడంతో అప్పులపాలవుతున్నాం. రైతులను ఆదు కోవాలి.

-గుర్రప్ప, రైతు, చింత కుంట్ల



పర్యాటక శాఖకు ప్రతి ఏటా రూ.1.50 కోట్ల ఆదాయం

ప్రపంచంలోనే రెండో అతి పెద్ద గుహలుగా గుర్తింపు

మరింత అభివృద్ధి చేయాలంటున్న పర్యాటక ప్రియులు

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్న వైనం

పర్యాటకం



అబ్బురం.. అద్భుతం.. బెలుం గుహలు..!

కొలిమిగుండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొన్ని వేల సంవత్సరాల క్రితం నదీ జలాల ప్రవాహంతో ఏర్పడిన బెలుం గుహలు ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్నాయి. ప్రపంచంలోనే హిమయాత్ గుహల తర్వాత పొడువైన గుహలుగా బెలుం గుహలు ప్రసిద్ధి కెక్కాయి. నిత్యం దేశ విదేశీ పర్యాటకులతో కళకళలాడుతూ ప్రతి ఏటా ప్రవేశ రుసుం ద్వారా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు పర్యాటక శాఖకు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రదేశంగా వెలుగొందుతున్న బెలుం గుహలను మొట్ట మొదటగా 1884లో ఐరోపాకు చెందిన రాబర్ట్ బ్రూస్‌పూటే వెలుగులోకి తెచ్చాడు. ఆతర్వాత 1982-84 మధ్య కాలంలో హెచ్‌డి గేబర్ అనే పశ్చిమ జర్మనీకి చెందిన గుహల పరిశోధకుడు తన బృందంతో గుహల్లో పరిశోధన జరిపారు. టార్చ్ లైట్ల సహాయంతో 3,225 మీటర్లు లోపలికి వెళ్లి, పరిశోధించి, గుహల మ్యాప్‌ను రూపొందించాడు. అనంతరం 1989లో ఏపీ ఆర్కియాలజీ డిపార్టుమెంట్ వారు గుహలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 1997లో జాతీయ స్థాయి బృందం స్థానికుల సహాయంతో ఈ గుహలను సందర్శించి, మొట్ట మొదటగా బెలుం గుహలపై ప్రత్యేక కథనాన్ని ఆకాశవాణి ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. 2000 సంవత్సరంలో ఏపీ టూరిజం శాఖ ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. రూ.కోటికి పైగా నిధులతో గుహల్లో లైటింగ్, సీసీ రోడ్డు, ఆక్సిజన్ కోసం బ్లోయర్స్, వాటర్ ఫౌంటేన్లు, వంతెనలు తదితర అభివృద్ధి పనులు చేపట్టి, 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ గుహలను జాతికి అంకితం చేశారు.



బెలుం గుహల చరిత్ర

ఆసియా ఖండానికే తలమానికంగా ఉన్న బెలుం గుహలు సుమారు 2,114 మీటర్లు పొడవు కలిగివున్నాయి. ప్రపంచంలో ప్రథమ స్థానంలో అమెరికాలోని హిమయాత్ గుహలు ఉండగా, రెండవ స్థానంలో బెలుం గుహలు ఉండడం గర్వించదగ్గ విషయం. బెలుం గ్రామానికి దగ్గరగా, బెలుం గ్రామంలో ఉండే మరో గుహ(బావి)తో ఇవి అనుబంధంగా ఉండటంతో బెలుం గుహలుగా ప్రాచుర్యం లభించింది. బెలుం గుహలకు మూడు ముఖ ద్వారాలు ఉన్నాయి. ఒకటి గుహల్లోకి వెళ్లే ద్వారం అయితే రెండవది బెలుం గుహలకు 2కిలోమీటర్ల దూరంలో బెలుం గ్రామంలో ఉంది. ఇది నిత్యం నీటితో నిండి ఉంటుంది. దీన్ని గ్రామస్థులు దిగుడు బావిగా ఉపయోగిస్తున్నారు. ఇక మూడవది గుహల్లోకి ప్రవేశించే ద్వారం పక్కనే కనిపిస్తుంది. గుహల్లోకి ప్రవేశించగానే లోపల 100మీటర్ల విశాలంతో రహదారి కనిపిస్తుంది. ఎత్తు 20మీటర్లకు పైబడి కనిపిస్తుంది. అలా కొంత దూరం లోపలికి వెళితే 50మీటర్లు వెడల్పుగా మారిన గుహలు, మరింత లోపలికి వెళితే ఒక్క మనిషి మాత్రమే లోపలికి వెళ్లగలిగే ఇరుకైనవిగా ఉన్నాయి. మరోవైపు ఈ బెలుం గుహలకు అనంతపురం జిల్లా గుత్తి గుహలతో అనుసంధానం ఉందని చరిత్రకారులు చెబుతున్నారు.

సెస్సు ఆదాయాన్ని లక్ష్యం మేరకు సాధించండి

● రైతులకు మద్దతు ధర అందించండి ● మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆశించిన రీతిలో పంటలు సాగయ్యాయని, అందువల్ల ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం మేరకు మార్కెటింగ్ సెస్సులో వ్యాపారుల నుంచి వసూలు చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశించారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో ఏడీఎం కాన్ఫరెన్స్ హాల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల మార్కెట్ కమిటీల సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు రూ.54 కోట్ల సెస్సు ఆదాయాన్ని సాధించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని మించి సెస్సు వసూలు చేయాలని కర్నూలు, నంద్యాల జిల్లాలో ఏడీఎంలు నారాయణమూర్తి, రెహిమాన్‌లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, కోడుమూరు సెక్రటరీ రెహిమాన్, పత్తికొండ సెక్రటరీ కార్నలీస్ ఆలూరు సెక్రటరీ సునీత, అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29 నుంచి ఎంఎస్ఎంఈ సర్వే

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ఎంఎస్ఎంఈ సర్వేను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. ర్యాంప్‌లోని భాగమైన ఎంఎస్ఎంఈలో వాణిజ్య రంగం, సేవ, తయారీ వంటి వాటిని ఏపీఎంఎస్ఎంఈ పోర్టల్‌లో అనుసంధానం చేయాలని సూచించారు.

కనువిందు చేస్తున్న గుహల అందాలు

గుహల లోపలి భాగంలో సహజ సిద్ధంగా ఏర్పడిన వివిధ ఆకృతుల్లో అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. నునుపైన పైకప్పు, గదుల్లాంటి ప్రదేశాలు, ఏనుగు తల, కోడి గుడ్డు ఆకారం, వీణా, మృదంగం తరహాలో ఏర్పడిన సహజసిద్ధ శిల్పాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు గుహల పైభాగంలో పర్యాటక శాఖ వారు ఏర్పాటు చేసిన 60అడుగుల అతి పెద్ద బుద్ధ విగ్రహం గుహలకే తలమానికంగా మారింది. పర్యాటకుల సౌకర్యార్థం గుహల్లో చూడాల్సిన అతి ముఖ్యమైన 10ప్రాంతాలను పర్యాటక శాఖ గుర్తించింది.ఆయా ప్రాంతాల్లోని ఆకారాలను బట్టి చలపతిరెడ్డి హాల్, ధ్యాన మందిరం, వెయ్యి పడగలు, ఊడలమర్రి, కోటి లింగాలు, పార్వతమ్మ గుడి, సప్తస్వరాలు, మాయా మందిరం, పాతాళగంగ, బుద్ధ విగ్రహం ఉన్నాయి. పాతాళగంగ ప్రాంతంలో నిత్యం నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నీటి ప్రవాహం ఉన్న గుహ ఎంత వరకు ఉన్నది తెలియని పరిస్థితి.



గుహ లోపల నీరు ప్రవహించే పాతాళగంగ ప్రాంతం



గుహల సందర్శనలో విదేశీ పర్యాటకులు(ఫైల్)

మరిన్ని పరిశోధనలు అవసరం

అద్భుతమైన బెలుం గుహలపై మరిన్ని పరిశోధనలు అవసరమని పర్యాటక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హెచ్‌డి గేబర్ పరిశోధనలో సైతం బెలుం గుహల చుట్టూ 124 గుహలు ఉన్నట్లు వెల్లడించారు. గుహలపై మరింత పరిశోధనతో పాటు, గుహల్లోనూ గుహల ఆవరణంలోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తే పర్యాటక శాఖకు మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

ఇలా చేరుకోవాలి..

కొలిమిగుండ్ల మండల కేంద్రానికి 3కిలో మీటర్ల దూరంలో అనంతపురం - అమరావతి ప్రధాన రహదారిలో ఈ గుహలు ఉన్నాయి. కర్నూలు, ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి బనగానపల్లెకు చేరుకొని, అక్కడి నుంచి అనంతపురం, తాడిపత్రి వెళ్లే బస్సులు ఈ గుహల మీదుగానే వెళ్తాయి. పిల్లలకు రూ.50, పెద్దలకు రూ.70 ప్రవేశ రుసుం చెల్లించు బెలుం గుహలను సందర్శించవచ్చు.



గుహ లోపలి వెళ్లే ప్రధాన మార్గం

హంద్రీ నీవా విస్తరణ పనులు చేపట్టాలి

● కర్నూలు పశ్చిమ ప్రాంత ప్రాజెక్టులు పూర్తి చేయాలి

● సీఎం చంద్రబాబుకు జిల్లా ఎమ్మెల్యేల వినతి

● సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి హామీ

కర్నూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రధాన కాలువ విస్తరణ పనులు తక్షణమే చేట్టాలి.. మిగులు జలాలు కర్నూలు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించేలా చర్యలు తీసుకోవాలి.. పశ్చిమ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంచే పనులకు నిధులు ఇచ్చి పూర్తి చేయాలి కోరుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు గౌరు చరిత, బీవీ జయనాగేశ్వరెడ్డి, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, గిత్తా జయసూర్య గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును అసెంబ్లీలోని సీఎం ఛాంబరులో కలసి వినతిపత్రం అందజేశారు. హంద్రీనీవా ద్వారా ప్రస్తుతం రోజుకు 2 వేల క్యూసెక్కులు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. కాలువను విస్తరణ చేస్తే 3,500 క్యూసెక్కులు ఎత్తిపోయవచ్చని, అంటే.. రోజుకు 1.5 టీఎంసీలు వరకు అదనంగా కృష్ణా జలాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఏడాదిలో 10-15 టీఎంసీలు అదనంగా లిఫ్ట్ చేయవచ్చని చంద్రబాబుకు వివరించారు. ఆ అదనపు జలాల పాణ్యం, నందికొట్కూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో లిఫ్టులు ద్వారా కరువు నేలకు మళ్లించి రైతులకు అండగా నిలవాలని చంద్రబాబును కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ హంద్రీ నీవా విస్తరణ పనులతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టలకు పూర్తి చేస్తామని, తాగు, సాగునీటికి ప్రత్యేక నిధులు కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు అనుమతులు మంజూరు చేయడంలో జాప్యం చేయకూడదని కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులు త్వరిత గతిన మంజూరు చేయాలని ఆదేశించా రు.

పారిశ్రామిక ప్రోత్సాహకాలు..

రూ.3.48 కోట్లకు ఆమోదం

పారిశ్రామిక ప్రోత్సాహకాల్లో 39 క్లెయిమ్స్‌కు రూ.3,48,71,941కు ఆమోదం దొరికింది. పెట్టుబడి రాయితీ కింద 33 క్లెయిమ్స్‌కు రూ.2,85,80,357 విద్యుత్ ఖర్చు రీయంబర్స్‌మెంటు కింద క్లెయిమ్‌కు రూ.1,50,222 వడ్డీ రాయితీ రియంబర్స్‌మెంటు కింద 3 క్లెయిమ్స్‌కి రూ.10,19,167, సేల్స్‌ట్యాక్స్ కింద 2 క్లెయిమ్స్‌కు రూ.51,22,195 ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు.

టీబీ బోర్డు అవినీతిపై విచారణ జరపాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

కర్నూలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తుంగభద్ర కాలువ ఆధునికీకరణ, మరమ్మతుల్లో జరిగిన అవకతవకలు, అవినీతి అక్రమాలపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ చేయించాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గురువారం అసెంబ్లీలో కోరారు. ఆధునికీకరణ పనుల్లో వైసీపీ కాంట్రాక్టరు అక్రమాలకు పాల్పడ్డారని ఏకంగా బోర్డు అకౌంట్‌నే ఫ్రీజ్ చేశాయడం వల్ల సిబ్బంది, ఉద్యోగులు జీతాలు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, సంబంధిత మంత్రి తక్షణమే స్పందించి అకౌంట్ ఫ్రీజ్ తొలగించి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ పనుల్లో బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టరు పెత్తనం కొనసాగింది. గత వైసీపీ నేతలకు 5 శాతం వరకు వాటాలు ఇచ్చి పనులు దక్కించుకున్నారు. బోర్డులో ఆ కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికే అధికారుల అండతో లైనింగ్ పనులు ఇష్టారాజ్యంగా చేశారని, నాణ్యతాప్రమాణాలు తుంగలో కలిపేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పనుల్లో అవినీతి అక్రమాలపై విచారణ చేసి నిగ్గు తేల్చేవరకు బోర్డుకే కేటాయించిన నిధులను వినియోగించవద్దని ఏపీ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీ టీబీపీ బోర్డు కార్యదర్శి, కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడంతో బోర్డు అకౌంట్ ఫ్రీజ్ చేశారు. దీంతో ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. కర్ణాటక పరిధిలో జలచౌర్యం అడ్డుకొని ఏపీ రావాల్సిన నీటి వాటాను సరిహద్దులోకి వచ్చేలా పని చేస్తున్న ఉద్యోగుల అవస్థలు ఎన్నో. ఈ అంశాలపై ఆంధ్రజ్యోతి వరుసల కథనాలతో వెలుగులోకి తెచ్చింది. స్పందించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో గళమెత్తారు.

బడి వేళల్లో మార్పు

● జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 26 ఉన్నత పాఠశాలల ఎంపిక

● ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

● నేటి నుంచి 29 వరకు పక్కాగా పాటించాలని ఉత్తర్వులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల పని వేళలను మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పని వేళలను గంట పెంచింది. ఉదయం 9 నుండి సాయంత్రం ఐదు వరకు కచ్చితంగా విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. జిల్లాలో 26 ఉన్నత పాఠశాలలను మొదట పైలెట్ కింద ఎంపిక చేసింది. ప్రతి మండలానికి ఒక ఉన్నత పాఠశాలలను గుర్తించింది. అందుకు ఎంపిక చేసిన పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యుల్ గుర్తించిన పాఠశాలల వివరాలను డిప్యూటీ ఈవోలకు, ఎంఈవోలకు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు జారీ చేసిన ఉత్తర్వుల కాపీలను పంపారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలని ఆయా సబ్జెక్టులలో వెనుకబాటుతనం, ఉపాధ్యాయుల కొరత నివారణకు, ప్రధానంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండడంతో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు.

ఎంపిక చేసిన 29 ఉన్నత పాఠశాలలు ఇవే...

ఆదోని పట్టణంలోని అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆలూరు, ఆస్పరి మండలం కైరుప్పల, సీ బెళగల్ ముడుమాల, చిప్పగిరి మండలం నేమకల్, దేవనకొండ మండలం కోటకొండ, గోనెగండ్ల మండలం కునూరు, గూడూరు, హాలహర్వి మండలం కొక్కరచేడు, హొలగుంద సులువాయి, కల్లూరు, కోడుమూరు మండలం ఆమదగుంట్ల, కోసిగి, కౌతాళం మండలం హాల్వి, క్రిష్ణగిరి మండలం కంబలపాడు, మద్దికెర, మంత్రాలయం మండలం మాధవరం, నందవరం మండలం కనకవీడు, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, పత్తికొండ మండలం హోసూరు, పెద్దకడబూరు, తుగ్గలి ఆర్ఎస్ పెండేకల్, వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి, ఎమ్మిగనూరు ఎస్ఎంఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు.



ఆదోని అమరావతి నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

విద్యార్థుల ప్రవర్తన మార్పు కోసమే..



విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తెచ్చి విద్య నైపుణ్యాలను మరింత మెరుగుపరచడం కోసం బడి పని వేళల్లో మార్పు చేశాం. ప్రతి మండలానికి ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి వారం రోజులపాటు గంటపాటు ఎక్కువ బడి ఉండేలాగా ప్రయోగాత్మకంగా చేపట్టాం.

- శ్యామ్యూల్ పాల్, విద్యాశాఖ అధికారి కర్నూలు

మంచిది కాదు



బడి వేళల్లో ప్రభుత్వం మార్పు చేయడం మంచిది కాదు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులు బడిలో గడపడం వల్ల వారు మానసికంగా ఒత్తిడికి గురై బడి మానేసే పరిస్థితులు నెలకొంటాయి. గతంలాగే బడి వేళలను కొనసాగించాలి.

- ఎంసీ సుంకన్న, ఎస్‌టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి, ఆదోని

నాడు హామీ.. నేడు ఆమోదం



(5వ పేజీ తరువాయి)

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. వైసీపీ అధికారం చేపట్టింది. అయినా చంద్రబాబు మాట మార్చలేదు. అదే హామీకి కట్టుబడి నిలబడ్డారు. గత ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, సీఎం జగన్ కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తే.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 'హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడుతాం..' అంటూ ప్రజాగళం సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేసింది. హైకోర్టు అభిప్రాయం కోరుతూ గత నెల 28న లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ నంబరు.2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ వెంటనే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం, గురువారం శాసనసభ, మండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ చర్యలో పాల్గొన్న రాయలసీమ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ మాట తప్పింది..



వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని పాలాభిషేకాలు చేయించుకున్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్నారు. మాట తప్పి మడత తిప్పి రాయలసీమ ద్రోహిగా జగన్ నిలి చారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.

- ఆర్.సవిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

వైసీపీది రెండు నాలుకల ధోరణి



గత వైసీపీ ప్రభుత్వం కర్నూలులో న్యాయ రాజధాని అంటూనే మంగళగిరిలో జుడీషియల్ అకాడమి ఏర్పాటుకు జీవో ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు పెట్టాలనే ఆలోచన ఉండేదని, ఆ ఆలోచన ఉపసంహరించుకుంటున్నామని 2022 నవంబరు 22న సుప్రీం కోర్టుకు తెలిపింది. చంద్రబాబు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ మాటకు కట్టుబడి బెంచ్ ఏర్పాటు కార్యాచరణ చేపట్టింది.

- కాల్వ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే, అనంతపురం జిల్లా

ఐదేళ్లు మాయ చేశారు



రాయలసీమకు హైకోర్టు తెస్తామంటూ గత వైసీపీ పాలకులు ఐదేళ్లు మభ్యపెట్టి మాయ చేశారు. క్షీరాభిషేకాలు చేయించుకున్నారు. ప్రాజెక్టులు, రోడ్లు, ఉద్యోగాలు ఏది అడిగినా హైకోర్టు వస్తుందని సీమ ప్రజలను మోసం చేశారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళం సభలో మాటిచ్చారు. ఆ మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేశాం.

- భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

సాకారం దిశగా 87 ఏళ్ల స్వప్నం

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 87 ఏళ్ల స్వప్నం. బెంచ్ రూపంలో సాకారం కాబోతుందని రాయలసీమ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహంలో శ్రీబాగ్ భవనంలో జరిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రతినిధుల సమావేశంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందమే 'శ్రీబాగ్ ఒడంబడిక'. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుతో కర్నూలు కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసినా నాలుగేళ్ల ముచ్చటగానే ముగిసింది. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయింది. అయితే.. సీమ ప్రజల్లో మదిలో శ్రీబాగ్ ఒడంబడిక అంశాలు చెదిరిపోలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.

హైకోర్టు బెంచ్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

-జేఏసీ కన్వీనర్, న్యాయవాది వై.జయరాజు



కర్నూలు లీగల్: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయం చాలా సంతోషం. బెంచ్ ఏర్పాటు నిర్ణయంతో ఆగకుండా ప్రభుత్వం వెంటనే ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. కర్నూలు నుంచి మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్ తరలివెళ్తాయనే వార్తలు రావడంతో సీమ ప్రజలు, న్యాయవాదులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మంత్రి టీజీ భరత్ హామీతో సీమ ప్రజలకు భరోసా వచ్చింది. హైకోర్టు బెంచ్ రావడంలో మంత్రి కృషి ఎనలేనిది. రాయలసీమలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నందుకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


విశ్వసనీయతకు ప్రతీక ఈ తీర్మానం



కర్నూలులో హైకోర్టు బెంచ్ రాబోతుందంటే ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసనీయతకు ప్రతీక. దమ్మున్న నాయకుడిగా, రాయలసీమ బిడ్డగా సీఎం చంద్రబాబు ప్రజాగళం సభలో ప్రజల మధ్యలో చెప్పిన మాటను అమలు పరిచేవిధంగా ముందుకు వెళ్తున్నాం. తీర్మానంపై సీమ ప్రజలు తరఫున ధన్యవాదాలు తెలుపున్నాను. వడివడిగా కార్యాచరణ పూర్తి కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరగా ఏర్పాటు చేయాలి.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

త్యాగాల గడ్డ కర్నూలు



తెలుగువారు ఐక్యత కోసం రాజధానిని త్యాగం చేసిన ఘనత కర్నూలుకు ఉంది. రాయలసీమ ప్రజలు కోర్టు పనుల కోసం ఎంతో దూరం వెళ్లాల్సి వస్తున్నది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయం ప్రజలకు ఎంతో మంచి చేస్తుంది. సీమవాసిగా ఈ చర్చలో నేనుకూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది.

- డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్యే, ఆదోని

ఎద్దుల బండిపై నుంచి పడి రైతు మృతి



గోపాల్(ఫైల్)

వెలుగోడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతకందాల గ్రామంలో ఎద్దుల బండిపై నుంచి పడి పోలబోయిన గోపాల్ (54)అనే రైతు మృతి చెందాడు. గోపాల్ తన ఎద్ల బండిపై ఎరువులు వేసుకొని పంట పొలానికి వెళ్లాడు. బండిపై ఉన్న ఎరువు బస్తాలను కిందికి దింపే క్రమంలో ఎడ్ల బండి ముందుకు కదిలాయి. దీంతో బండిపై నుంచి గోపాల్ కింద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు వెలుగోడు హాస్పిటల్‌కు తరలించి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

పెట్రోల్ బంకులో బొలేరో ఢీ.. యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



ఈరన్న (ఫైల్)

ఎమ్మిగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కలుగొట్ల రోడ్డు లెదర్ సొసైటీకి ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో బొలేరో వాహనం ఢీకొని ఈరన్న(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన ఈరన్న, నాగరాజులు ఎమ్మిగనూరు పట్టణంలో పని ముగించుకొని మోటార్ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. పట్టణ శివారులో ఉన్న పెట్రోల్ బంకులో బైక్‌కు పెట్రోల్ పోయించుకొని ముందుకు కదిలారు. అయితే మరో వైపు డీజిల్ వేయించుకునేందుకు నిలిచిన బొలేరో వాహనం ఒక్కసారిగా వేగంగా దూసుకొచ్చి మోటార్‌బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్ బైక్‌ను నడుపుతున్న ఈరన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనివెంట ఉన్న నాగరాజుకు తీవ్ర గాయాలయ్యా యి. స్థానికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చికిత్సకు కర్నూలుకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బొలేరోలో ఉన్న ఓ బాలుడు బ్రేక్‌కు బదులుగా ఎక్స్‌లేటర్‌పై కాలు పెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చాకలి రాముడు(ఫైల్)

చాగలమర్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని చిన్నబోదనం గ్రామానికి చెందిన చాకలి రాముడు (33)మృతి చెందాడు. పెద్దబోదనం గ్రామానికి చెందిన అంజి తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నబోదనం గ్రామానికి చెందిన చాకలి రాముడు, అంజి ఇద్దరు మద్దూరు గ్రామంలో జరుగుతున్న వివాహానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అక్కడ వివాహం చూసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా 40వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో చాకలి రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. అంజి గాయపడ్డాడు. అంజిని హైవే అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని చితకబాదిన ఎక్సైజ్ ఎస్ఐ?

- స్పృహ తప్పడంతో ఆసుపత్రికి తరలింపు
- స్టేషన్ ముందు బంధువుల ఆందోళన



నిందితుడు నాగార్జునను బయటకు తెస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం కేసులో పట్టుబడిన ఓ నిందితుడిని ఎక్సైజ్ పోలీసులు విచక్షణారహితంగా చితకబాదారు. దీంతో నిందితుడు స్పృహ తప్పి పడిపోయిన సంఘటన గురువారం ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. నందవరం మండల జగ్గాపురం గ్రామ శివారులో కర్ణాటక మద్యం రవాణా అవుతుందన్న సమాచారంతో ఎమ్మిగనూరు ఎక్సైజ్ పోలీసులు గురువారం వేకువజామున దాడులు చేశారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న జగ్గాపురానికిచెందిన రంగన్న, హరికృష్ణ, నాగార్జునలపై దాడి చేయగా హరికృష్ణ తప్పించుకున్నాడు. రంగన్న, నాగార్జునలను అదుపులోకి తీసుకొని వారి దగ్గర ఉన్న 15 మద్యం బాక్సులను, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. మరో నిందితుడు హరికృష్ణను సైతం గురువారం పట్టుకున్నారు. విచారణలో భాగంగా నిందితులు రంగన్న, నాగార్జున, హరికృష్ణలను ఎస్ఐ ఇస్మాయిల్ విచక్షణారహితంగా చితకబాదడంతో దెబ్బలకు తుట్టుకోలేక హాహాకారాలు చేశాడు. వీరిలో నాగార్జున స్టేషన్‌లోనే స్పృహతప్పి పడిపోయాడు. దీంతో భయపడిపోయిన పోలీసులు వెంటనే నిందితులను స్టేషన్ నుంచి బయటకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఎస్ఐ, పోలీసులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించి తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న నిందితుల బంధువులు, గ్రామస్తులు, నాగార్జున భార్య, కుటుంబ సభ్యులు హుటాహుటిన స్టేషన్ దగ్గరకు చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉద్రిక్తత వాతావరణం చేటుచేసుకుంది. తప్పు చేసి ఉంటే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచాలిగాని ఇలా ఎలా.. కొడతారంటూ నిందితుల బంధువులు మండిపడ్డారు. తన భర్తను విచక్షణారహితంగా కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నాగార్జున భార్య డిమాండ్ చేసింది. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ నాయక్, సిబ్బంది స్టేషన్ దగ్గరకు చేరుకొని నిందితుల బంధువులతో మాట్లాడి శాంతింప జేశారు. మద్యం రవాణా చేయటం, అమ్మటం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డిని వివరణ కోరగా.. నాగార్జునను విచారిస్తుండగానే ఫిట్స్ వచ్చి పడిపోయాడని, తమ సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారన్నారు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని తెలిపారు. నాగార్జునను తమ సిబ్బంది కొట్టారని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.



స్టేషన్ వద్ద గ్రామస్తులు, బంధువులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.41.11 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కర్నూలు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదోని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. 21 కేసుల్లో ఈ నిందితులు దొంగలించిన రూ.41.11 లక్షల సొత్తును రికవరీ చేశారు. గురువారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నిందితుల అరెస్టుపై వివరాలు వెల్లడి చేశారు. నిందితులు సముద్రాల పృథ్వీరాజ్ (నెల్లూరు), దండగల సరోజ (ఆత్మకూరు, నంద్యాల), మాణిక్యాల విష్ణు (ఆత్మకూరు, నంద్యాల), సముద్ర యేసుబాబు (నెల్లూరు), జగదీష్ (నెల్లూరు), గుంజా రాఘవ (సిద్ధాపురం, నంద్యాల), సముద్రాల డేవిడ్ (నెల్లూరు), రామలక్ష్మి (ఆత్మకూరు, నంద్యాల), దావూద్ బాషా (ఆత్మకూరు, నంద్యాల), ఆకుల వీరేష్ (ఎమ్మిగనూరు), సయ్యద్ మహ్మద్ (ఆదోని), వీరేష్ (కడప జిల్లా), బోయ వీరేష్ (ఎమ్మిగనూరు)లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు రమణమ్మ (నెల్లూరు), గిడ్డన్న (ఆత్మకూరు) పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ నిందితులు అయోధ్య, వారణాసి, కలకత్తా, గోవా, ముంబై, తిరుపతి, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు.



నిందితుల నుంచి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

24న కమ్మవారి కార్తీక వనభోజనాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కమ్మవారి కార్తీక వనభోజన కార్యక్రమం ఈనెల 24న నందికొట్కూరు రోడ్డులోని కాకతీయ నగర్ కమ్మ సంఘం ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా కమ్మ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, పెనికలపాటి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల ప్రాంగణంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. జిల్లాలోని కమ్మ వర్గీయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు దుర్గపూడి నాగిరెడ్డి, కల్యాణ మండపం పర్యవేక్షకుడు కూసుపాటి బాబ్జి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కర్లపూలడి జనార్ధన్ రావు, సోంపల్లి శేఖర్, కరుణాకర్ చౌదరి, గుమ్మల్ల విజయశేఖర్, పినికలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్నకమ్మ సంఘం నాయకులు

వనభోజనం జయప్రదం చేయండి : బలిజ సంఘం



కరపత్రికను విడుదల చేస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర కాపు, తెలగ, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్ తెలిపారు. గురువారం ఐదు రోడ్ల కూడలిలోని సంఘ కార్యా లయంలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠం పాఠశాల ఆవరణలో కార్తీక వనభోజనాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పిల్లలు, మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నగర నలుమూలల నుంచి వనభోజనానికి తరలి రావడా నికి బస్సు సౌకర్యం, వినోదానికి జబర్దస్త్ టీవీ షో కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు శైలేష్, వెంకటేశ్వర్లు, అనిమిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలపడితేనే రైతులకు లాభం

డీసీవో రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతోనే రైతులు లాభాలబాట పడుతారని జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరం సమీపంలోని కల్లూరు సహకార సంఘం ప్రాంగణంలో సహకార జెండాను డీసీవో రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లూరు సహకార సంఘం సీఈవో పుల్లయ్య డీసీవోతో పాటు ఇతర అధికారులకు ఒకే అందించి సన్మానించారు. ఈ సమావేశంలో హాజరైన రైతులను ఉద్దేశించి డీసీవో రామాంజనేయులు మాట్లాడుతు రైతులు బాగుపడాలంటే.. స్వయం ప్రతిపత్తితో సహకార సంఘాలు అభివృద్ధి చెందాలన్నారు. వాణిజ్య బ్యాంకులతో పోటీ పడుతూ సహకార సంఘాలు, కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాత పని వేళలను కొనసాగించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యజమాన్యాల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో పాత పనివేళలను కొనసాగించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాశాఖ పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగించడం వల్లన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈసమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు గోట్ల చంద్రశేఖర్, చంద్రశేఖర్ యాదవ్, రవీంద్ర, వెంకటేశప్ప పాల్గొన్నారు. అలాగే డీటీఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలల పనివే ళలు మార్చాలని కైరవాడి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాపర్లపాడుకు రోడ్డు వేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఉలిందకొండ నుంచి యాపర్లపాడుకు రోడ్డు వేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొట్టె చెన్నయ్య కోరారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ జిల్లా కేంద్రానికి 25 కి.మీల దూరంలో యాపర్లపాడు గ్రామం ఉందని, అందులో 700 నుంచి 800 మంది జనాభా జీవిస్తున్నారని అన్నారు. ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సులు ఆటోలు, రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి యాపర్లపాడుకు రోడ్డు వేయాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వైజాగ్‌లో జరిగిన యునైటెడ్ ప్రైవేటు స్కూల్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్.క్రిష్టఫర్, కర్నూలు, నంద్యాల జిల్లాల కన్వీనర్లు సి.కుమార్, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శిగా రఘునాథరెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసులు, జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా టి.నాగన్న, కోశాధికారిగా నాగరాజును ఎన్నుకున్నారు. గురువారం కర్నూలులో నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించినట్లు యూపీఎస్ఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎం.క్రిష్టఫర్ తెలిపారు.

దరఖాస్తులను విచారించాలి

సి.బెళగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను విచారించి, వారి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వీఆర్వోలకు ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం నిర్వహించిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాలలో నుంచి రైతు లు 755 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈసమావేశంలో సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు రూ.11 కోట్ల మేర సొత్తు సైబర్ మోసాల్లో పోగొట్టుకున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందుమాదవ్ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జ్యువెలరి షాపు యజ మానులు, లాడ్జిల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాట చేసుకోవాలన్నారు. త్వరలో జిల్లాకు వంద ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయని తెలిపారు.

అపార్ అనుసంధానంపై దృష్టి సారించాలి

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అపార్ అనుసంధానం పూర్తిచేసేలా పాఠశాలల యాజమాన్యాలు దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి దీప్తి ఆదేశించారు. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, విద్యాశాఖ అధికారులు, స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలతో అపార్ నమోదుపై ఆమె సమీక్షించారు. పాఠశాలలు, కళాశాలల రికార్డులో విద్యార్థుల పేరు, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్‌లో విద్యార్థుల పేరు ఒకేలా ఉండేలా అపార్ అనుసంధానం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కల్లూరు మండలంలో మొత్తం 230 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 56,836 మంది విద్యార్థులు చదువు కుంటున్నారని, అందులో 39,993 మంది 70.37 శాతం మాత్రమే ఇప్పటి వరకు అపార్ అనుసంధానం అయినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎస్ రెడ్డి, ఎంఈఓ వనజ పాల్గొన్నారు.

సిరుల వరి

● గిట్టుబాటు ధర కోసం
రైతన్న ఎదురు చూపులు
● యంత్రాలకు భలే డిమాండ్


రైతులు సాగు చేసిన వరి పంట

ఓర్వకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరి పంట సిరులు కురిపిస్తోంది. గత మూడేళ్ల నుంచి వరిపంట దిగుబడులు తగ్గాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట దిగుబడి భారీగా పెరగ డంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఓర్వకల్లు, కాల్వ, కాల్వబుగ్గ, హుశేనాపురం, కన్నమడకల, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో 2వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. గత ఏడాది ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. ఎకరాకు పెట్టుబడి రూ.30వేలు పెట్టామన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో ఎకరాకు 25 నుంచి 35 బస్తాలు వచ్చే అవకా శం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

● **యంత్రాలకు భలే డిమాండ్:** వరి పంటను తొలగించేందుకు యంత్రాలకు భలే డిమాండ్ పెరిగింది. గంటకు యంత్రానికి రూ.2,500 చెల్లిస్తున్నారు. యంత్రం రోజుకు 10 ఎకరాల కోత కోస్తుందని రైతులు తెలిపారు. అయితే కూలీలు దొరక్కపోవడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.

దిగుబడి ఆశాజనకం



మూడెకరాల్లో వరి పంటను సాగు చేశాను. గత మూడేళ్ల నుంచి వర్షాలు లేవు. గ్రాసా నికి ఇబ్బందులు పడ్డాం. ఈ ఏడాది బాగా వర్షాలు కురిసి పంట దిగుబడి బాగా వచ్చింది. వరికి గిట్టుబాటు ధర కల్పించాలి.

- అల్లాబాబు, రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



ఆరు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. ఎకరాకు 30వేలు చొప్పున పంటపై పెట్టుబడి పెట్టాను. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- గని స్వాములు, రైతు

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, న్యాయవాదులు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో లేఖ రాయడంపై టీడీపీ కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత నివాసంలో ఆయన రాష్ట్ర న్యాయ విభాగం సెక్రటరీ నాగముని, న్యాయవాదులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా పెరుగు పురుషోత్తంరెడ్డి, నాగముని మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజాగళం సభలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే మంత్రి వర్గ సమావేశంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తూ తీర్మానం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కర్నూలులో న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని కేవలం ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, వీరేంద్ర కుమార్, శ్రీకాంత్, న్యాయవాదులు జగదీష్, అయ్యస్వామి పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్: ఎన్నికల హామీలో భాగంగా కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు కురుబ కురువ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కే.రామ కృష్ణ ధన్యవాదాలు తెలిపారు. గురువారం కురుబ, కురుమ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టు బెంచ్‌తో రాయలసీమ ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుధాకర్, సాంబశివుడు, మహేష్ పాల్గొన్నారు.

26న మహాధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న జరిగే రైతు కార్మిక సంఘాల మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం పిలుపునిచ్చారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల కేంద్ర కార్మిక సంఘాలు కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ సమితి పిలుపు మేరకు జడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు మహాప్రదర్శన అనంతరం ధర్నా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఉద్యమంలో చనిపోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, టి.రామాంజనేయులు ఈశ్వర్, డీసీ రహిమాన్ పాల్గొన్నారు.

కుడా చైర్మన్, రాష్ట్ర డైరెక్టర్లకు సన్మానం


డైరెక్టర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వివిధ శాఖలకు రాష్ట్ర స్థాయిలో నియమితులైన డైరెక్టర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్, ఎస్సీ సెల్ నగర కమిటీ ఆధ్వర్యంలో వేర్వే రుగా సన్మాన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా పోతురాజు రవికుమార్, రాష్ట మాదిగ కార్పొరేషన్ డైరెక్టరుగా ధరూర్ జేమ్స్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్రలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు కే. గిడ్డన్న మాట్లాడుతూ జిల్లాలో సీనియర్ దళిత నాయకులను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వడం ద్వారా తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్స్ జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు పోతురాజు పెంచలయ్య, కర్ణ, ఈశ్వర్, అనంతయ్య, దినేష్, మాధవ్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శంగా నిలిచిన సురేష్‌బాబు


సురేష్‌ను శాలువతో సత్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి ఎందరో యువతకు ఆదర్శంగా నిలిచిన సురేష్‌బాబుని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఘనంగా సత్కరించారు. సురేష్‌బాబు అనే వ్యక్తి 17 సంవత్సరాలకే ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని, ఆఫ్రికా ఖండంలోనే ఎత్తయిన కిల్లీ మంజారా పర్వతాన్ని, యూరప్ ఖండంలోని ఎల్బ్రూస్ పర్వతాన్ని, ఆస్ట్రేలియాలోని కొనియాజుకు పర్వతాన్ని, సౌత్ అమెరికాలోని అకింగువ పర్వతాన్ని అధిరోహించినందుకు గానూ తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో, అలాగే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా తన పేరు లిఖించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. గురువారం బిర్లా కాంపౌండు, గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంపు, దామోదరం సంజీవయ్య కూడలి, వై.జంక్షన్, కొండారెడ్డి బురుజు తదతర ప్రాంతాలలో కమిషనర్ రహదారుల భద్రత కమిటీతో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారుల భద్రత కమిటీ నగరానికి సంబంధించి 21 నిర్ణాణాలు తీసుకుందన్నారు. వాటి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సూర్‌బాషా, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, డీఈఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గళం విప్పారు. కోడుమూరు, గూడూరు, బెళగల్ మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, కోడుమూరు నియోజకవర్గం చుట్టు ఇటు హంద్రీనది, అటు తుంగభద్రనది ఉన్నప్పటికీ ప్రజలకు మాత్రం తాగడానికి గుక్కెడు నీళ్ల దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కోడుమూరులో నాలుగు రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం తోనే నీటి ఎద్దడి తలెత్తిందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పటికైన కోడు మూరు నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కోరారు.

సర్వే ముమ్మరం


విమానాశ్రయం సమీపంలో కొలతలు వేస్తున్న సర్వేయర్లు

ఓర్వకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు విమానాశ్రయం సమీపంలో గురువారం తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సర్వేయర్ శంకర్ మాణిక్యంతోపాటు సర్వేయర్లు ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించిన సర్వేను చేపట్టారు. విమానాలు రాత్రివేళల్లో నిలిచే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఓర్వకల్లు, పూడిచెర్ల పొలాలను సర్వే చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సోమన్న సచివాలయ సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ సహాయకులుగా, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని గురువారం డీఆర్వో వెంకటనారాయణమ్మకు ఏపీ విలేజ్ రెవె న్యూ ఆఫీసర్ అసోసి యేషన్ రాష్ట్రకోశాధికారి, జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమద్దయ్య, శ్రీధర్, ఆదినారాయణరెడ్డి, పెద్దయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెస్‌పై అవగాహన అవసరం

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, అధ్యాపకులకు చెస్ ఆటలపై అవగాహన అవసరమని క్లస్టర్ యూనివర్శిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం యువ తరంగ్ క్రీడా పోటీల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు చెస్ పోటీలు ప్రారంభించారు.

నాయీబ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

కల్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులపై అను చిత వ్యాఖ్యలు తగవని సంఘం రాష్ట్ర కన్వీనర్ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని సి.క్యాంపులోని తన కార్యాలయంలో నాయీ బ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ సొసైటీ స్టోర్స్ ఇన్‌చార్జి రామరాజు తీరును ఆయన ఖండించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ కులం పేరుతో అవమానకరంగా వ్యవహరించిన రామరాజుపై సెక్షన్ 50 కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, శివరామ్, జనార్ధన్, అనిల్ పాల్గొన్నారు.

బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి

సి.బెళగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని ఈర్లదిన్నె, శింగవరం గ్రామాల్లో పంటబీమా చేసుకున్న రైతులకు కార్డులను అందజేశారు. ఈసమావేశంలో రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న నిర్మల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ గురువారం రైల్వే స్టేషన్ కూడలిలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ విశాఖలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, నగేష్, నగర నాయకులు అబ్బు, భాస్కర్, నాయక్ పాల్గొన్నారు.

సారాబట్టీలపై పోలీసుల దాడులు

ఓర్వకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడుంబాయి తండా గ్రామంలో ఎక్సైజ్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 3,600 లీటర్ల సారా బెల్లం, 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ కృష్ణ, డీటీఎఫ్‌సీ సీఐ రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ నిర్ణయంపై హర్షం


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు లీగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై కర్నూలు బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం చారిత్రాత్మకమైనదని, ఇది ఆయనకు రాయలసీమపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కృషి ఎనలేనిదని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకుని వీలైనంత తొందరలో హైకోర్టు బెంచ్ పని చేసేలా సీఎం చొరవ తీసుకోవాలని కోరారు. హైకోర్టు సాధన సమితి జేఏసీ కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు బెంచ్‌తో పాటు ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్‌ను కర్నూలులోనే కొనసాగిస్తూ పారిశ్రామికంగా కూడా కర్నూ లు అభివృద్ధి చేసేందుకు సీఎం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కే.ఓంకార్, రంగ రవికుమార్ పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కర్నూలులోని కృష్ణకాంత్ ప్లాజాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం విలేకరుల సమావేశంలో వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ అన్ని బీసీ కులాలతో కలిసి సామూహిక ఈనెల 23న వనభోజనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని అన్నారు. ప్రధాన కార్యదర్శి టి.మద్దులేటి మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు గెస్టు హౌస్ నుంచి బీసీ అన్ని కులాలు ర్యాలీగా బయలుదేరి నందికొట్కూరు రోడ్డులోని ఆదర్శ విద్యామందిర్‌కు చేరుకుంటాయని, అక్కడ బీసీల వనభోజనంతో పాటు బీసీ శంఖారావం రాష్ట్ర మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఏపీ ఇన్‌చార్జి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నూకారమ్మ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, పలువురు బీసీ మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో నాయకులు లక్ష్మణరావు, మురళీ మోహన్, శ్రీనివాసులు, కుబేరస్వామి, ఉప్పర, రజక సంఘాల నాయకులు నాగభూషణం, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ షెడ్యూల్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ షెడ్యూల్‌ను ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు ప్రకటించారు.

● నెట్‌బాల్ అండర్-17 బాలికల పోటలు అన్నమయ్య జిల్లా సీటీఎం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరుగును. ఎంపికైన క్రీడాకారుల ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా డీఎస్ఏ స్టేడియంలోని స్కూల్ గేమ్స్ కార్యాలయంలో నాలుగు సెట్ల ఎలిజిబిలిటీ పార్మ్‌లు గత సంవత్సరం మార్కులిస్టు జిరాక్స్, ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోలు వెంట తీసుకుని రావాలి. ఈ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయురాలు చంద్రకళకు రిపోర్టు చేయాలి.

● కరాటే అండర్-14, 17 బాలబాలికలు అనంతపురం జిల్లా అశోక్ నగర్, ఇండోర్ స్టేడియంలో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో జరుగును. ఎంపికైన క్రీడాకారులు సంబంధిత డాక్యుమెంట్లతో ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలి

● సెపక్‌తక్రా అండర్-14 బాలబాలికల పోటీలు కేబీసీ జిల్లా పరిషత్ పాఠశాల ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 24, 25 తేదీల్లో జరుగును. ఎంపికైన క్రీడాకారులు 23వ తేదీన ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో రిపోర్టు చేయాలి.

● సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలురు రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో జిల్లా పరిషత్ పాఠశాల కొనకండ్ల వజ్రకరూరు మండలం అనంతపురం జిల్లాలో జరుగును. ఎంపికైన క్రీడాకారులు 22వ తేదీ ఉద యం 9 గంటలకు రిపోర్టు చేయాలి

● రగ్బీ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరుగును. వీరు 22న ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలి

● బేస్‌బాల్ అండర్-14 బాలురు, బాలికలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళం తిరుపతి జిల్లాలో జరుగుతాయని, వీరు 23న రిపోర్టు చేయాలని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు ఎన్.గిడ్డయ్య, పి.శ్రీనాథ్‌లు తెలిపారు.

38వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

కర్నూలు రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని మామిదాలపాడుకు సంబంధించిన 38వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వై.రామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 38, 39, 40వ వార్డుల్లో మహిళలు పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రూ.100 సభ్యత్వంతో రూ5లక్షల పరిహారం ఇస్తుందని రామేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకులమ్మ, హైమావతి, సాంబశివరావు, మహేశ్వరరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పత్తికొండకు కలెక్టర్

పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశానికి నేడు కలెక్టర్ పి.రంజిత్ బాషా హాజరవుతున్నట్లు ఎంపీడీవో సువర్ణలత గురువారం తెలిపారు. గోపాల్ ప్లాజాలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వరద బాధితులకు విరాళం



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదబాధితుల కోసం సేకరించిన రూ.13,86,000ను చెక్కును గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే పార్థసారథి అందజేశారు. రాష్ట్రంలో ఏ ఆపద వచ్చినా సాయం చేసేందుకు ఆదోని ప్రజలు సిద్ధంగా ఉంటారని ఎమ్మెల్యే తెలిపారు. బీజేపీ ప్రత్యేక ఆహ్వానితులు విఠ్ఠా రమేష్, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, దేశాయ్ చంద్రన్న, మరియాని చిన్న బసప్ప పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రమాదేవిని టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. రీసర్వేలో తప్పులు చోటుచేసుకున్నాయన్నారు. మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప, లక్ష్మీనారాయణ చౌదరి, స్వామి నాయక్ పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు మరువలేనివి



శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు మొట్టి శ్రీనివాసులు(55) సేవలు మరువలేనివని పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, నక్కల రమేష్, అన్నారు. గురువారం పగిడిరాయిలో శ్రీనివాసులు మృతి దేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మైరాముడు, రాము ఉన్నారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

ఆదోని రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్‌ను పంపిణీ చేయాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. గురువారం రెవెన్యూ భవన్‌లో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సివిల్ సప్లయ్ డీటీ వలీబాషా పాల్గొన్నారు.

నీటి పన్ను జాబితాను సిద్ధం చేయండి

నీటి పన్ను జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. గురువారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

విద్యుత్ ఆపరేటర్ మృతి

- కుటుంబానికి రూ.50వేలు ఇచ్చిన ఉద్యోగులు



కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్నఉద్యోగులు

పత్తికొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చకాయలమాడకు చెందిన విద్యుత్ ఆపరేటర్ రంగస్వామి(41) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు ఈదెలదేవరబండ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. దేవనకొండ ఏఈ రవీంద్ర, ఉద్యోగులు కుటుంబానికి రూ.50 వేలను అందజేశారు.

పారిశుధ్యంపై కమిషనర్ దృష్టి



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై మునిసిపల్ కమిషనర్ కృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం తెల్లవారుజామున కార్మికుల పనితీరును పర్యవేక్షించారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెండు రోజులకోసారి తాగునీటి సరఫరాకు కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, రాంజల చెరువు నుంచి నీటిని సరఫరా చేసి బసాపురం చెరువు మరమ్మతలు చేస్తామన్నారు.

చెక్ పోస్టులను బలోపేతం చేస్తాం

- ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి



ఆదోని , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ఎక్సైజ్ చెక్ పోస్టులను బలో పేతం చేస్తున్నట్లు ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు తక్కువగా ఉన్న చోట సిబ్బం దిని నియమిస్తున్నామన్నారు. మద్యం కొరత వార్తలు నిజం కాదన్నారు. మద్యం వ్యాపారులకు 20శాతం కమీషన్ ఇస్తున్నామని, సాంకేతిక సమస్యతో ఆగిపోయిం దన్నారు. జిల్లాలో బెల్ట్ షాపులు ఏమీ లేవన్నారు. మద్యం దుకాణాల్లో గదులు ఏర్పాటు చేసి సిట్టింగ్ వేస్తే కేసులు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎక్కువ మద్యం తీసుకెళ్తతున్న వారిపై నిఘా ఉంచామని, ఇప్పటివరకు 40కేసులు పైగా నమోదు చేశామన్నారు.



రహదారి పక్కనే ఉన్న ముళ్ల కంప

కంపతో ముప్పు

ఆదోని-ఆలూరు ఎన్‌హెచ్-167 జాతీయ రహదారికి ఇరువైపులా ముళ్ల కంప ఏపుగా పెరిది. దీంతో రహదారి కుచించుకుపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారిలో నిత్యం రోజుకు వేలల్లో భారీ వాహనాలు వెళుతుంటాయి. భారీ వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి, ముళ్ల కంపను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఆదోని**

పొంచి ఉన్న ముప్పు



ఆదోని మండలం గణేకల్లులో ప్రధాన రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మధ్యలో ఉంది. దీన్ని మరోచోటికి మార్చాలని గ్రామానికి చెందిన పెద్ద విరుపాక్షి, రంగస్వామి కోరారు. ఈ విషయమై స్పందనలో అర్జీ సమర్పించినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఏమాత్రం ఆదమరచినా, పిల్లలు, మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదముంది. విద్యుత్ . ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్‌ను వేరేచోటకు తరలించాలని గ్రావస్తులు కోరుతున్నారు. **- ఆదోని రూరల్**

సారూ.. ఇదేం తీరు

- మాన్యంగా పట్టా భూములు
- లబోదిబోమంటున్న రైతులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



పెరవలిలో రైతులు సాగుచేసిన భూమి

తమ పట్టా భూములు ఆన్‌లైన్‌లో మాన్యం భూములుగా చూపుతుండటంతో రైతులు లబోదిబో మంటున్నారు. పలుమార్లు రెవెన్యూ, దేవదాయ అధికారులకు అర్జీలు సమర్పించినా పట్టించుకోక పోవడతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి, మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలకు చెందిన భూములు దాదాపు 150 ఎకరాలకు ఆన్‌లైన్‌లో మాన్యం భూములుగా చూపుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వేనెం. 707, 705, 591, 630తో పాటు మరికొన్ని సర్వే నెంబర్లలోని పొలాలు ఇలా చూపుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

అమ్మేందుకు వీలు లేక..

కొందరు రైతులు తమ ఆర్థిక పరిస్థితి బాగాలేక పొలాలు అమ్ముకుందామని పత్తికొండ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఇవి మాన్యం భూములని అమ్మేందుకు వీలు లేదంటున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. దేవదాయ, రెవెన్యూ అధికారులను కలిసి అర్జీలు సమర్పించినా ప్రయోజనం లేదని అంటు న్నారు. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందు తున్నారు. తమ గోడు విని న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ హుశేన్‌సాహెబ్‌ను వివరణ కోరగా భూముల రికార్డులను పరిశీలించి, పరిష్కరిస్తామని తెలిపారు.

ఆన్‌లైన్‌లో మాన్యం భూమిగా ఉంది



మా పెద్దల నుంచి నాకు భూమి వచ్చింది. రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే.. మాన్యం భూమిగా ఉందన్నారు. రెవెన్యూ అధికారులను సంప్రదించినా వారు స్పందించడం లేదు. **- ముత్యాలు, మద్దికెర**

ఆలయ భూమిగా ఉంది



ఎన్నో ఏళ్లుగా భూమి నా ఆధీనంలో ఉంది. రెవెన్యూ రికార్డుల్లో రంగనాథ స్వామి ఆలయ భూమిగా ఉంది. పలుమార్లు రెవెన్యూ, దేవదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. **- తిమ్మప్ప, పెరవలి.**

పత్తి రైతులు నష్టపోవద్దు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మాట్లాడుతూ సీసీఐకి వక్రయించాలని, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పత్తి ధరలు పతనమయ్యాయన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.7521కంటే రూ.400కు తక్కువగా ఉందని రైతులు ఆలోచించి రైతు సేవాకేంద్రాలలో సీసీఐకి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూర్య నారాయణ

ఆలూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూర్య నారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అల్లాబకాష్ చిప్పగిరికి బదిలీ అయ్యారు. దేవనకొండ ఈవోఆర్డీ సూర్య నారాయణకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



హైకోర్టు బెంచ్‌పై హర్షం

ఆదోని టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అభినందనీయుడని మైనారిటీ సమితి కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. గురువారం మాట్లాడుతూ కర్నూలులో హై కోర్టు బెంచ్‌ను ఏర్పాటుకు క్యాబినెట్ అమోదించడం హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు పహారాలో వేలం పాట

- ఘర్షణలు జరగకుండా కౌన్సెలింగ్ ఇచ్చిన డీఎస్పీ



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతమార్కెట్‌లో నిర్మించిన 27 దుకాణాలకు గురువారం వేలం ముగిసింది. గత నాలుగేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న వేలంపాటలు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ అరుణాదేవి, డీఎల్‌పీవో వీరభద్రప్ప, కార్యదర్శి ప్రభాకర్ వేలంపాటలు నిర్వహించారు. మొత్తం 14 దుకాణాలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు కులాల ప్రాతిపదికన కేటాయించారు. పంచాయతీకి నెలకు రూ.1,20,900ల చొప్పున ఏడాదికి రూ.14,58,800 ఆదాయం వస్తుందని డీఎల్‌పీవో తెలిపారు. దుకాణాలకు మరమతులు చేయించి, విద్యుత్ సరఫరా అనంతరం జనవరి 1న స్వాదీనం చేస్తామన్నారు.

సీనియర్ సివిల్ కోర్టును ఏర్పాటుచేయాలి



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెలే, తదితరులు

పత్తికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పత్తికొండలో సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు న్యాయశాఖ కార్యదర్శి సునీతను కోరారు. గురువారం టీడీపీ నాయకులు తుగ్గలినాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే అమరావతిలో న్యాయ శాఖకార్యదర్శితో కలిసిమాట్లాడారు. న్యాయవాదులు, కక్షిదారులు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలి



పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న కల్లుగీత కార్మికులు

ఆదోని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు బైలాస్ ప్రకారం నిర్వహించాలని కల్లుగీత కార్మిక సభ్యులు లింగన్న గౌడ్, గోవిందరాజు గౌడ్, రాము మోహన్ గౌడ్, రాము గౌడ్ కోరారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కల్లుగీత కార్మికుల సొసైటీ ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్లు గురువారం ప్రారంభంగా ఇద్దరు నామినేషన్లు వేశారు. నామినేషన్లకు 23 వరకు గడువు ఉంది. ఎన్నికలు 27న నిర్వహించనున్నారు.

క్రిమినల్ కేసులు ఉన్నవారిని తొలగిస్తున్నాం: సైదుల్లా ఎక్సైజ్ సీఐ

సొసైటీలో క్రిమినల్ కేసులు ఉన్నవారిని తొలగిస్తున్నాం. కొత్తవారిపై ఓ వర్గం ఫిర్యాదు చేయడంతో, కలెక్టర్, సబ్ కలెకర్‌కు నివేదించాం. వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

24న శంకర మఠంలో కార్తీక పూజలు

ఆదోని టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల నగర్‌లోని శంకర్ మఠంలో 24వ తేదీన బ్రాహ్మణ సేవా సంఘం కార్తీక మాసం పూజలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథ్ దేశాయ్ తెలిపారు. ఉపాధ్యాక్షుడు ఓంనగర్ సత్యనారాయణ కార్యదర్శి చక్రవర్తి దేశాయ్, యస్‌డి గిరి, కమల్నాబ్ శర్మ, వైద్యం నాగరాజ్ పాల్గొన్నారు.

బెంచ్ ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్ అన్నారు. గురువారం తుగ్గలిలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్, లోకాయుక్త కోర్టు ఏర్పాటుకు అసెంబ్లీ ఆమోదం తెలిపార న్నారు. ఇందుకు పోరాడిన నాయకులకు రుణపడి ఉంటామన్నారు. ఎడవలి తిమ్మప్ప, బెస్త క్రిష్ణ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుం బిగించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ సూచించారు. ఎన్‌సీసీ 77వ ఆవిర్భావ వారోత్సవాల్లో గురువారం కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. విద్యార్థులు ఇళ్లవద్ద మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. పర్యావర ణంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, ఎన్‌సీసీ కమాండెంట్ గోవిందు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై డీఎల్పీవో విచారణ

వెల్దుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం డీఎల్పీవో లక్ష్మి స్పందన అర్జీలపై విచారణ చేశారు. సామూహిక మరుగుదొడ్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయన్న ఫిర్యాదు మేరకు అప్పట్లో పనిచేసిన అధికారులను విచారించారు. పరిపాలనాధికారి గంగాధర్, ఎంపీడీవో సుహాసినమ్మ, ఈఓఆర్డీ రవికిశోర్, అప్పటి జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందం

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి, బురుజుల హంపా గ్రామాల్లో రీసర్వేలో సమస్యల పరిష్కారానికి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ రీసర్వే సమస్యలతో 539 దరఖాస్తులు వచ్చాయన్నారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్, ఆర్ఐ రవికకుమార్, రషీద్ తదితరులు ఉన్నారు.

రైతు సంఘం అధ్యక్షుడిగా హనుమన్న

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సహాయ కార్యదర్శి హనుమన్నను మండల రైతు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పత్తికొండలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు

వలసలు వద్దు.. ఉపాధి కల్పిస్తాం



మాట్లాడుతున్న ఏపీడీ ఫక్కీరప్ప

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని వలస పోవద్దని ఏపీడీ ఫక్కీరప్ప అన్నారు. గురువారం ఎడవలి గ్రామంలో సర్పంచ్ నంది కల్పన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో 11 గ్రామాలుండగా, 10వేల జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పనులను గుర్తించాలన్నారు. అవినీతి చోటుచేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ సలహాదారుడు జయరాముడు, మాజీ సర్పంచ్ శివ, కార్యదర్శి పరమేశ్వరప్ప, తదితరులు ఉన్నారు.

వాహనాలకు పత్రాలు ఉండాలి: ఎంవీఐ

వెల్దుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఆర్‌సీ, రోడ్డు టాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫకెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కర్నూలు ఎంవీఐ నాగరాజు నాయక్ సూచించారు. గురువారం మండలంలోని రామళ్లకోట, వెల్దుర్తి గ్రామాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. పది వాహనాలపై కేసు నమోదుచేసి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆటోల్లో క్కువ మంది ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఏఎంవీఐ గణేష్ బాబు, సిబ్బంది ఉన్నారు.

కనీస వేతనాలు ఇచ్చే వరకు విధులు బహిష్కరిస్తాం

ఆలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనాలు ఇచ్చేవరకు విదులు బహిష్కరిస్తున్నట్లు గిరిజన గురుకుల పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం పాఠశాలలో విధులు బహిష్కరించారు. ఉపాధ్యాయుల ప్రతాప్, మల్లికార్జున, విజయకుమారి మాట్లాడుతూ 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు ఇవ్వాలని, తమపే సీఆర్‌టీలుగా గుర్తించి మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. డీఎస్సీలో తమ పోస్టులను మినహాయించి, రెగ్యులర్ చేయాలని కోరారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారి నిర్మాణానికి టీడీపీ మండలాధ్యక్షుడు బలరాం గౌడ్, యువ నాయకుడు రమాకాంత్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. సంతబజారులోని నీళ్లట్యాంకు నుంచి మసీదు మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు రూ.25లక్షలతో రోడ్డు నిర్మించనున్నారు.

26న ఛలో కలెక్టరేట్ : సీఐటీయూ

వెల్దుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 26వ తేదీన చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేట్‌కు రూ.20లక్షల కోట్లు రాయితీలు ప్రకటించిం దన్నారు. నల్ల చట్టాలను మరలా తేవడానికి ప్రయత్నం చేస్తున్నా, కూటమి నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడు, శ్రీనివాసులు, చిన్నయేసు, వెంకటరాముడు ఉన్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు

ఆదోని రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఓ బెల్టుషాపు నిర్వాహకురాలిని అరెస్టు చేశారు. పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపిన మేరకు.. గురువారం మద్యం విక్రయిస్తుండగా 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కౌతాళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలంలో ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ కౌతాళం గ్రామ అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు ఉలిగయ్య కోరారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలో 30 పంచాయతీలు ఉన్నా ఆధార్ అప్‌డేట్ కేంద్రం లేకపోవడంతో ఆధార్ కోసం మండల ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, కొత్తగా పెళ్లైన వారు ఆధార్‌లో చిరునామాల మార్పు కోసం ఆదోనికి వ్యయప్రయాసాలతో వెళ్లాల్సి వస్తుందన్నారు. పేదలు ఆధార్ సేవలు పొందేందుకు వారిపై ఆర్థిక భారం పడుతున్నదని తెలిపారు. కాబట్టి మండల అధికారులు స్పందించి మండలంలో ఒక ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంపీడీవో సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ శివకుమార్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తేనే ఓటు



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రాజెక్టుల కింద సాగు చేసే రైతులు నీటితీరువ పన్ను చెల్లిస్తేనే ఓటు హక్కు ఉంటుందని తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో 77 టీసీ మెంబర్లు 7,071 మంది ఓటర్లు ఉన్నారని, 12 టీసీ మెంబర్లకు ఒక అధ్యక్షుడుగా ఎంపిక చేస్తారని తెలిపారు. మాధవరం, రచ్చుమర్రి, చెట్నహళ్లి, బూదూరు, మాలపల్లి, రాంపురం,ఖగ్గల్లు గ్రామాల్లో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. ఓటింగ్‌లో పాల్గొనే రైతులు 2022 వరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించి ఓటులో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజ రావు, ఆర్ఐ ఆదామ్, జయరామిరెడ్డి, వీఆర్వోలు నర్సప్ప, ఆనంద్, శ్వేత, భీమన్నగౌడు, ప్రభాకర్, పుష్పలత, భీముడు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

పెద్దకడబూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోదం తెలపడం హర్షణీయమని టీడీపీ తెలుగు రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం రాజధాని పేరుతో మూడు ముక్కలాట ఆడారన్నారు. అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరగలాన్నదే కూటమి ధ్యేయమన్నారు. లోకాయుక్తా, మానవ హక్కుల కమిషన్ కర్నూలులోనే ఉంటాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేరవేర్చాడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తోటి ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మిగనూరు బాలిక ఉన్నత పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నీలకంఠ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇందుకు స్పందించిన ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్ ఆధ్వర్యంలో ప్రసన్నరాజు, వెంకటేశ్వర్లు దాతల సహకారంతో దాతృత్వం చాటారు. దాదాపు రూ.1లక్షలు నగదును అందజేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, బాబయ్య, మహ్మద్‌రఫీ, బసవ రాజు, అడివన్న, లింగమూర్తి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు టీవీ మెకానిక్ యునియన్ నూతన కమిటిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని స్టోర్స్ భవనంపై యునియన్ సమావేశాన్ని నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా రఫీక్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా ఖాజా, ట్రెజరర్‌గా వీరప్ప, సహాయ కార్యదర్శిగా మోహన్‌లతోపాటు ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

పాత పద్ధతిలోనే పాఠశాలల పనివేళలు కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల వేళలను పాతపద్ధతిలోనే కొనసాగించాలని డీటీఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, మోపసాని రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం భోజన విరామ సమయంలో హెచ్ కైరవాడి పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసనలు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పాఠశాలల పనిసమయాన్ని రోజు ఒక గంట పాటు పెంచిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు కొనసాగాలని జీవో విడుదల చేసిందని, అయితే పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 26 పాఠశాలలో ఈ నూతన విధానం కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా గోనెగండ్ల మండలంలో కున్నూరు పాఠశాలలో ప్రారంభం కానుందన్నారు. ఇప్పటికే ఆపార్ జనరేషన్, పదవ తరగతి నామినల్ రోల్స్, స్టడీ అవర్స్‌తో ఉక్కిరి బిక్కిరవుతున్నారన్నారు. మరింత భారం పెంచేవిధంగా మరో గంట పని సమయం పెంచడం సరికాదన్నారు. ప్రభుత్వం పెంచిన సమయంను తగ్గించాలని కోరారు. ప్రభుత్వం బకాయి పడ్డ డీఏలు, పీఆర్సీలు, అరియర్స్ చెల్లించాలని, దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్, ఏపీ జీఎల్ఐ రుణాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహబూబ్‌బాషా, ఎల్లప్ప, ముర్తుజావలి, నారాయణరావు, సంధ్యారాణి, మాధవి పాల్గొన్నారు.

ఇక పింఛన్ కష్టాలు తీరినట్లే ..

● మూడు నెలలకు ఒకేసారి తీసుకునేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం
● హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధులు



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ నెల పింఛన్ ఆ నెలలోనే తీసుకోవాలి... లేక పోతే మరుసటి నెల పోయిన నెల డబ్బులు ఇవ్వరు... మూడు నెలలు తీసుకోకపోతే పింఛన్ కూడా రద్దు చేసిన సందర్భాలు ఉన్నాయి... ఇది వైసీపీ ప్రభుత్వం తీరు. ఈవిధానం వల్ల వృద్ధులు బాధపడిన సందర్భాలు ఉన్నో.. పింఛన్ దారులు ఎక్కడ ఉన్నప్పటికి నెల ఒకటో తేదీకి సొంత గ్రామానికి చేరుకునేవారు. సుదూరంలో ఉన్న వారు ఆపసోపాలు పడాల్సి వచ్చేది. కాని కూటమి ప్రభుత్వం వృద్ధులపై కనికరం చూపి వారికి శుభవార్త తెలిపింది. మండలంలో 28 గ్రామాలకు గాను 9,180 పింఛన్లు ప్రతి నెల పంపిణీ చేస్తున్నామన్నారు. పింఛన్‌దారులు సకాలంలో పింఛన్ తీసుకోక పోతే మూడు నెలల పింఛన్ ఓకేసారి తీసుకునేలా కూటమి ప్రభుత్వం జీవోను జారీ చేసింది. దీంతో వృద్ధులు పాటు పింఛన్ లబ్ధిదారుల మోహల్లో ఆనందం వెల్లి విరిసింది.

● గోనెగండ్లకు చెందిన రుద్రమ్మ అనే వృద్ధురాలికి వితంగు పింఛన్ వస్తుంది. కొన్ని కారణాల వల్ల బెంగళూరులోని తన పెద్ద కుమారుని దగ్గర ఉంటుంది. దీంతో పింఛన్ కోసం ప్రతినెల బెంగళూరు నుంచి గోనెగండ్లకు వచ్చి పింఛన్ తీసుకువెళ్లేది. దీంతో వచ్చిన సొమ్ములో సగం వరకు రహదారి ఖర్చులకు ఇతరత్ర ఖర్చులకు అయిపోయేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం కారణంగా ఆమె సంతోషం వ్యక్తం చేస్తుంది.

● గోనెగండ్లకు చెందిన శివమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛన్ వస్తుంది. ఈమె గూడురులో తన బంధువులు దగ్గర నివాసం ఉంటుంది. పింఛన్ వచ్చే సమయానికి ఆటోలలో ఇతరత్ర వాహనాలలో ఇబ్బందులు పడుతూ గోనెగండ్లకు వచ్చి పింఛన్ తీసుకువెలుతుండేది. ఇక ఆ సమస్య తీరింది.

● రాయచూరులో ఉంటున్న బేగం తన భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో తన పుట్టింటిలో ఉంటుంది. పింఛన్ వచ్చే సమయానికి గోనెగండ్లకు ప్రతి నెల వచ్చి తీసుకువెలుతుండేది . ఇక ఆమెకు ఆ తిప్పలు తప్పడంతో ఆనందం వ్యక్తం చేస్తుంది.

మూడు నెలల పింఛన్ ఒకేసారి ఇస్తాం



రెండు నెలలో అనివార్య కారణాల వల్ల పింఛన్ తీసుకోక పోయినప్పటి మూడు నెలల పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. కనుక ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.

\- మణిమంజరి, ఎంపీడీవో, గోనెగండ్ల

భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం

● ప్రైవేటు లాడ్జి ధరలకు రెక్కలు
● ఇబ్బందులు పడుతున్న భక్తులు



శ్రీమఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. రాఘవేంద్రస్వామికి ఇష్టమైన గురువారం పర్వదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మంత్రాలయం పురవీధులన్నీ కిటకిటలాడాయి. బుధవారం రాత్రి నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో శ్రీమఠం అతిథి గృహాలన్ని నిండిపోయాయి. దీంతో ప్రైవేటు లాడ్జిల యజమానులు ధరలకు రెక్కలు వచ్చాయి. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు లాడ్జిల యజమానులు భక్తుల నుంచి గంటకు ఒక రేటు నిర్ణయించి నిలువుదోపిడీ చేశారు. ఆర్టీసీ బస్టాండు, రాఘవేంద్రసర్కిల్, మధ్వమార్గ్ కారిడార్, తుంగభద్ర నదీతీరం, శ్రీమఠం ప్రాంగణం, అన్నపూర్ణ భోజనశాల ప్రాంతాలన్నీ భక్తులు పోటెత్తారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. పరిమళ ప్రసాదం వద్ద సందడిగా మారింది. ప్రసాదం కోసం శ్రీమఠం అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

శోభిల్లిన బంగారు రథం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో స్వర్ణ రథం శోభిల్లింది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పుష్పాభిషేకం, హారతుల అనంతరం బంగారు రథంపై అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చారు. విద్యుత్ కాంతుల మధ్య భక్తుల హర్షధ్వానాలు, మంగళవాయిద్యాలు వేద పండితుల మంత్రఘోషాల మధ్య రథం స్వర్ణ రథం ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నందవరం మండలం జగ్గాపురం గ్రామం క్రాస్‌లో కర్ణాటక మద్యాన్ని ఎమ్మిగనూరు ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నందవరం మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన బోయ హరికృష్ణ, బోయ నాగార్జున, బోయ రంగన్న అనే వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోయ హరికృష్ణ, బోయ నాగార్జున,బోయ రంగన్నలను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఇస్మాయిల్, హెచ్‌సీ గోపాల్,కరుణాకర్ పాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలోని సిద్దప్ప పాలెం గ్రామ చావిడి వద్ద కోసిగి చెందిన బి. రామకృష్ణ నుంచి అక్రమ కర్ణాటక మద్యం 90 ఎంఎల ఒరిజినల్ చాయిస్ 93 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఆదేశాలతో కర్ణాటక మద్యంపై ప్రత్యేక దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది నాగరాజు, కిషోర్‌కుమార్, మునిరంగడు, భరత్, రవికుమార్, జనార్దన్ ఉన్నారు.

సచివాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ప్రతి గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న సిబ్బందిని భర్తీ చేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడబూరులోని ఎంపీడీవో జయరాముడుకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 20 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీ, వీధిలైట్లును వేయాలన్నారు. బస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరన్న, దేవదాసు,హనుమంతు, రామన్న, భీమన్న పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడిన వైనం



విద్యుత్ తీగలపై విరిగి పడిన భారీ వృక్షం

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని వ్యవసాయకార్యాలయం అవరణలో ఉన్న భారీ వృక్షం ప్రమాదవశాత్తు కూలి గోడపై పడింది. వృక్షం విద్యుత్ వైర్లపై పడటంతో తీగలు తెగిపోగా స్తంభం సైతం నేలకొరిగింది. విద్యుత్ వైర్లలో విద్యుత్ ఉన్నప్పటికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ఆ కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



మాట్లాడుతున్న ఏవో మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేయాలని సర్పంచ్‌లు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంపీపీ కేశన్న అధ్యక్షత వహించారు. ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పనులను రైతులకు అనుసంధానం చేస్తే ఎంతో మేలు జరుతుందన్నారు. అలాగే విద్యుత్, వ్యవసాయం, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బంగారమ్మ, వైస్ ఎంపీపీ పోలయ్య, ఏవో మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రీమఠానికి నగదు, ఆభరణాలు విరాళం

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరు చెందిన శరణ్య రూ.10లక్షలు, ఎస్ఏ వాణి రూ. లక్ష, కాకినాడకు చెందిన కృష్ణచైతన్య రూ.లక్ష, బెంగళూరు చెందిన రాఘవేంద్ర 10 గ్రాముల బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా వేర్వేరు సమయాల్లో వారు రాఘవేంద్రస్వామిని దర్శించుకుని చెక్కు, నగదు రూపాల్లో విరాళాలు అందజేశారు.

అలరించిన భరతనాట్యం: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో బెంగుళూరు చెందిన మహావీర్ లలిత కళా అకడమి కన్వీనర్ తనూజ జైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది. గురువారం ప్రవచన మండపంలో రాఘవేంద్రస్వామి సజీవ సమాది పొందిన దినాన్ని పురస్కరించుకుని అన్నమాచార్యులు, త్యాగరాయులు, పురందరదాసుల కీర్తనలకు భరతనాట్యం నిర్వహించారు. ఇది భక్తులను ఆకట్టుకుంది. కళాకారులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం ఫలపుష్పమంత్రాక్షితలు, ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పెద్దకడబూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారుల్లో ఆదోని రోడ్డులో ఉన్న మహయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణలో గురువారం లక్ష్మమ్మ అవ్వ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కళశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కే.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కళశాల పూర్వ విద్యార్థి రఘు దంపతుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సూపరింటెండెంట్ మద్దిలేటి ,పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు లక్ష్మినారాయణ రెడ్డి,సభ్యులు రామకృష్ణ, రఘునాథ్, పరమేష్, జుబేరు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

వాహనాలకు పత్రాలు తప్పనిసరి: ఎస్ఐ

నందవరం, నవంబరు 21(ఆంధజ్యోతి): మండలంలోని ముగతి- మంత్రాలయం రోడ్డు సర్కిల్‌లో గురువారం రాత్రి ఎస్ఐ శ్రీనివాసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎస్ఐ వాహనాలు ఆపి వారి దగ్గర లైసెన్స్‌లను వారి రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వారిదగ్గర నుంచి జరిమానా విధించారు. వాహనాలు నడిపిపెటప్పుడు అన్ని రికార్డులు ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనం వాడేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని వాహనదారులకు సూచించారు..

మోటర్ బైకు చోరీ

ఎమ్మిగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిల్ప ఎస్టేట్‌లో ఇంటి ముందు నిలిపి ఉన్న మోటర్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బనవాసి గ్రామానికి చెందిన నరసింహులు శిల్ప ఎస్టేట్‌లోని అయ్యప్ప స్వామి గుడి లైన్‌లో ఓ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఎప్పటిలాగే ఇంటి ముందు బైక్ నిలబెట్టగా.. చోరీ జరిగింది. ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేపట్టారు.

గృహ నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ లే అవుట్‌లోని ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్, కమిషనర్ గంగిరెడ్డి, హౌసింగ్ అధికారులతో కలిసి హౌసింగ్ లే అవుట్‌లోని నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని, ఇక్కడ అన్ని వసతులు కల్పించాలని పట్టాదారులు వచ్చి ఇక్కడ నివాసం ఉండడానికి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అమినిటి సెక్రెటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ముందు టెక్స్‌టైల్ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించిన విషయాన్ని లేవనెత్తడంతో అధికారులు పార్కు స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఎంత స్థలం కేటాయించారు. ఆ స్థలాన్ని దేనికైనా వినియోగించారా అనే విషయాలను తహసీల్దార్ శేషఫణిని సబ్‌కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏనుగుబాల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని రీసర్వేలో వచ్చిన సమస్యలను ఆయన పరిశీలించారు. అలాగే హెల్త్ క్లీనిక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ జ్యోతి, సర్వేయర్ వాహిద్, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలింగ్ సరళిపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నందవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బారత రాజ్యంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నందవరం హైస్కూల్‌లో హెచ్‌ఎం శేఖరప్ప ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమాదేవి, మద్దయ్య, పరమేష్, రాజు, పార్వతిదేవి మాట్లాడుతూ అభ్యర్థుల జాబితా, బ్యాలెట్ పేపర్లు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసి మాక్ పోల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవరాజు, ప్రసాద్, ఎల్లప్ప, సూర్యనారాయణ, జయన్న, సత్యన్న, మేరి, విజయలక్ష్మి, లక్ష్మీకళ, ప్రమీలమ్మ, వాణి, పరిమళ, మహలక్ష్మీ, హనుమంతరావు, నరసన్న, కేశవ్ పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా చేసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ గోవిందు

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ గోవిందు తెలిపారు. గురువారం మండలంలోని మాధవరంలో ఇంటింటికి తిరిగి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై సోలార్ విద్యుత్ ఏర్పాటు ప్రభుత్వం ఇచ్చే రాయితీ, బ్యాంకు రుణం వంటి అంశాలపై వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక విద్యుత్ పొందవచ్చని తెలియజేశారు. అవసరమైన రైతులు గ్రామస్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నరసప్ప, రంగస్వామి, వేణుగోపాల్, ప్రదీప్ కుమార్, వీరేష్ స్వామి, హనుమంతు, రాజశేఖర్, చాంద్‌బాషా, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, పరీద్‌లు పాల్గొన్నారు.

'కొండల' వీరుడికి సత్కారం

● 17 ఏళ్లకే ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కేశాడు
● ఏషియన్ బుక్‌ఆఫ్ రికార్డులో చోటు



సురేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లకు చెందిన కొండల వీరుడు సురేష్ ను గురువారం కలెక్టర్ రంజిత్‌బాషా ఘనంగా సత్కరించారు. సురేష్ ఇంటర్ మీడియట్ చదివే సమయంలో 17 ఏళ్లకే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు. అలాగే ఆఫ్రికా ఖండంలోని ఎత్తయిన కిల్లిమంజారో పర్వతాన్ని, యూరప్ ఖండంలోనే ఎత్తయిన ఎల్బ్రూస్ పర్వతాన్ని ఆస్ట్రేలియాలో కొసియాజుకు పర్వతాన్ని, సౌత్ అమెరికాలోని అభింగువ పర్వతాంతోపాటు భారతదేశంలో దాదాపు అన్ని పర్వతాలను అధిరోహించాడు. ఇందుకుగాను సురేష్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, అలాగే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. దీంతో గురువారం సురేష్‌ను కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనకు మొదటి నుంచి సిల్వర్‌జూబ్లీ పూర్వ విద్యార్థుల సంఘంతోపాటు డాక్టర్ నాగేంద్ర జగన్, డాక్టర్ ఏఎస్ కన్నా, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్ అన్నివిధాల సహకారం అందించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, అఫ్రిది, వెంకటేష్, నాగరాజు, రవిలు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులో రాయలసీమ యునివర్శిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చారు.నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని బీఈడీ కళాశాలల్లో తరగతలు నిర్వహించకుండా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రాక్టికల్స్ తరగతులకు రాకపోయిన విద్యార్థులు ఇచ్చే ముడుపులు తీసుకొని హజరు వేస్తున్నారన్నారు. యునివర్శిటీ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.